క్లుప్తంగా

ప్రారంభమైన ఆరాధనోత్సవాలు


మంగరాయ ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్: మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి 353వ ఆరాధన మహోత్సవాలు స్థానిక మంగరాయ ఆంజనేయస్వామి సన్నిదిలో మంగళవారం ప్రారంభమయ్యాయి. మంత్రాలయం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థ శ్రీపాదులవారి ఆదేశాల మేరకు రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా శ్రీ మంగరాయ ఆంజనేయస్వామికి ఆలయ మేనేజర్ కొప్రేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు

ఆదోని అర్బన్: ఆదోని లయన్స్ క్లబ్ తరఫున మంగళవారం మండలంలోని ఆరేకల్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 120 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోపీనాథ్, కంటి వైద్యనిపుణులు డాక్టర్ కృష్ణమూర్తి, దంత వైద్యాధికారులు అల్తాఫ్, అయేషా, వినయ్ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్‌గుప్తా, సభ్యులు పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న సీఐ సూర్య మోహన్‌రావు

ఆదోని సెంట్రల్: విద్యార్థులు సమాజంపై అవగాహన కలిగి ఉండాలని 2వ పట్టణ సీఐ సూర్య మోహన్ రావు తెలిపారు. మంగళవారం సెయింట్ అంథోని పాఠశాలలో హెచ్ఎం కేశవయ్య అధ్యక్షతన యుక్త వయస్సులో జరుగుతున్న నేరాలు, ఘోరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమములో వార్డు మహిళా పోలీసు హైమావతి, ఉపాధ్యాయులు నిర్మలా మేరీ, ప్రకాశమ్మ తదితరులు పాల్గొన్నారు.

సద్గుణాలు అలవర్చుకోవాలి

కౌతాళం: ప్రతి వ్యక్తి పరమాత్ముడిని ధ్యానిస్తూ మానవత్వం, సద్గుణాలు కల్గి ఉండాలని ప్రజాహిత బ్రహ్మకుమారి ఈశ్వరియా విశ్వవిద్యాలయ కౌతాళం మండల పర్యవేక్షకురాలు అమృతేశ్వరి అన్నారు. రక్షాబంధన్‌ను పురస్కరించుకుని మంగళవారం ప్రతిభ హైస్కూల్‌లో ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులకు రాఖీ కట్టి స్వీట్లు పంచిపెట్టారు. కరస్పాండెంట్ దూద్‌బాషా, హెచ్ఎం జ్ఞానేశ్వరి, పాఠశాల కార్యదర్శి సయ్యద్ మైనుద్దీన్, ఉపాధ్యాయులు జయలక్ష్మి పాల్గొన్నారు.

విరూపాక్షిస్వామికి సన్మానం


విరూపాక్షిస్వామిని సన్మానిస్తున్న ఆర్డీఓ

ఆదోని అర్బన్: జనసేవా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు విరూపాక్షి స్వామిని గుంతకల్ ఆర్డీఓ వాక శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. మంగళవారం అనంతపురం జిల్లా గుంతకల్ పట్టణంలోని డాక్ట బాబు రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిని సత్కరించారు. ఇందులో భాగంగా ఆదోని పట్టణానికి చెందిన జనసేవా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు విరూపాక్షిస్వామిని సన్మానించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.హరిప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు.

సాదాపురంలో రుణమేళా

ఆదోని రూరల్: మండలంలోని సాదాపురం గ్రామంలో మంగళవారం యూనియన్ బ్యాంకు రుణమేళా కార్యక్రమాన్ని చేపట్టింది. రీజనల్ చీఫ్ మేనేజర్ పి.నరసింహారావు, రిటైల్ లోన్ హెడ్ శ్రీనాథ్‌రెడ్డి పాల్గొని ప్రజలకు రుణాలపై అవగాహన కల్పించారు. జీరో ప్రాసెసింగ్ ఫీజుతో రుణాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

పట్టణ ఎస్ఐగా డాక్టర్ నాయక్



ఎమ్మిగనూరురూరల్: పట్టణ ఎస్ఐగా డాక్టర్ నాయక్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రమేష్‌బాబు కర్నూలు వన్ టౌన్‌కు వెళ్లగా వీఆర్‌లో ఉన్న ఎస్ఐ డాక్టర్ నాయక్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

విద్యార్థిని ఆత్మహత్యపై నిగ్గు తేల్చాలి

ఎమ్మిగనూరుటౌన్: మంత్రాలయం మండల పరిధిలోని రచ్చుమర్రి ఏపీ మోడల్ స్కూల్‌లో పదోతరగతి చదువుతున్న పార్వతి ఆత్మహత్యపై నేటికి అధికారులు నిగ్గు తేల్చలేదని భారత ప్రగతి శీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థిని ఆత్మహత్య చేసుకొని 15రోజులు గడిచినప్పటికీ ఆత్మహత్యకు గల కారణాలు వెలుగులోకి తీసుకోరాలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికి హాస్టల్ ప్రిన్సిపాల్, వార్డెన్‌పై అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. నాయకులు చిన్న బాలు,నవీన్, ఎల్లప్ప, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కౌతాళం వంకలో చంటి పిల్లలతో ఉరుకుంద భక్తుల అవస్థలు


కౌతాళం వద్ద ఇసుక మెట వేసిన పాలం


తెర్నేకల్ వద్ద క్షేమంగా గట్టుకు చేరిన రైతులు, కూలీలు


కోసిగి వద్ద నీట మునిగిన ఉల్లి పైరు

భారీ వర్షం


తెలిగిపోయిన సజ్జలగుడం- దేవరబెట్ట కల్వర్టు


జీఆర్పీ కాలువకు గండిపడిన దృశ్యం

- పొంగిన వాగులు, వంకలు
- కొట్టుకు పోయిన ఉప్పరహాల్ వంక బ్రిడ్జి
- కోసిగి మండలంలో కొట్టుకుపోయిన కల్వర్టులు
- నిలిచిన రాకపోకలు

కౌతాళం: మండలంలో మంగళవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో మంగళవారం కురిసిన వర్షం అధికమని మండల ప్రజలు తెలుపుతున్నారు. ఒక్క రోజే సుమారు 66.4మి.మీల వర్షం కురిసింది. మండల పరిధిలోని ఉప్పరహాల్ వంకపై ఉన్న బ్రిడ్జి నీళ్ల తాకిడికి సగం కొట్టుకుని పోయింది. కౌతాళం వంకకు నీరు చేరడంతో ఉరుకుంద, హాల్వి రూట్లలో రాక పోకలు 11గంటల వరకు నిలిచిపోయాయి. కుంబళనూరు వంకలో వర్షపునీరు చేరడంతో మధ్యాహ్నం వరకు కుంబళనూరు-నదిచాగి గ్రామాల మధ్య రాకపోకలు ఆగిపోయాయి. అలాగే రౌడురు వంక ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కౌతాళం వంకలో ఉరుకుందకు వచ్చిన భక్తులు చంటి పిల్లలతో నడుచుకుంటూ రావడం కనిపించింది. కౌతాళం-ఆదోని మధ్యలో ఉన్న లక్ష్మీనగర్ వద్ద కూడా వంక పొంగి పొర్లింది. భారీ వర్షానికి చాల పొలాల్లో ఇసుక మేటా వేసింది. వంక పక్కన ఉన్న పొలాల్లో పరిస్థితి మరీ దారుణంగా తయారయ్యింది. పంట పూర్తిగా నీటి మునిగి కొన్ని చోట్ల కొట్టుకుని పోయింది.


నాగనాథహళ్లి వంకలో నుంచి తండ్రి, కుమారులను కాపాడిన యువకులు

కోసిగిలో కొట్టుకుపోయిన కల్వర్టు

కోసిగి : మండలంలో మంగళవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. మండలంలో 96.2 మీ. మీటర్లు వర్షపాతం నమోదైంది. భారీ వర్షం కురవడంతో మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మండలంలోని సాతనూరు కొట్టాల-జంపాపురం, సజ్జలగుడం- దేవబెట్ట గ్రామాల మధ్య కల్వర్టులు కొట్టుకుపోయాయి. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దేవరబెట్ట గ్రామానికి ఉన్న ఏకైక రోడ్డు కల్వర్టు కొట్టుకు పోవడంతో రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయి. అలాగే కోసిగిలోని బసవన్న వంక ఉధృతంగా ప్రవహించి భూగేని చెరువులోకి వెళ్లకుండా పంటపొల్లాకి నీరు చేరుకుంది. దాదాపుగా 50 ఎకరాల్లో పత్తి, ఉల్లి, మిరప, వేరుశనగ పంటలు నీట మునిగాయి. అలాగే ముగులదొడ్డి గురురాఘవేంద్ర ప్రాజెక్టులో భాగంగా జంపాపురం వైపు వెళ్లె జీఆర్పీ కాలువకు గండిపడి 20 ఎకరాల పంట నీట మునిగింది. పంట పొలాల్లో నీరు చెరడంతో రైతులు ఆందోళన చెందారు. దాదాపు రూ.30 లక్షలు పంట నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

తెర్నేకల్ హంద్రీలో చిక్కుకున్న రైతులు, కూలీలు

గోనెగండ్ల : మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామ సమీపంలోని తెర్నెకల్ హంద్రీనదిలో మంగళవారం గ్రామానికి చెందిన 26 మంది రైతులు, కూలీలు వేరు వేరుగా ఉదయం తెర్నేకల్ హంద్రీనది సమీపంలోని తమ పంట పొలాలకు వెళ్లారు. మిరపకాయల పెద్ద దరగయ్య, భీమన్న, ఆలురు పెద్ద దరగయ్య, రామలింగమ్మ, మంగమ్మ, జయమ్మ, రాకేష్, పులేంద్ర, సరస్వతి, పార్వతి, దొరస్వామి, రామేశ్వరమ్మ, మహాలక్ష్మి, చామంతి, ఇందు, శైలజ, రామాంజినమ్మ, దరగయ్య, కాశీవిశ్వనాథ్, మధు, బాబు, కేసు, కాశీమన్న అనే రైతులు, కూలీలు వేరు వేరుగా పొలాలకు వెళ్లారు. వారితో పాటు 16 ఎద్దులు, 18 పొట్టేళ్లను తమతో పాటు తీసుకువెళ్లారు. కొందరు వరినాట్లు వేసేందుకు వెళ్లగా మరి కొందరు మిరప నాట్లు వేసేందుకు వెళ్లారు. ఉదయం వారందరూ పనులకు వెళ్లేటప్పుడు హంద్రీనందిలో నీరు లేకపోవడంతో ఏరుదాటి పనులకు వెళ్లారు. అక్కడి వెళ్లి ఉదయం పనులు చేయడం మొదలుపెట్టారు. వీరి పొలాలు నది పాయల మధ్య ఉన్నాయి. 11 గంటల నుంచి హంద్రీలో నీటి ఉధృతి పెరుగుతూ వచ్చింది. నీరు పొలాలలను చుట్టుముట్టగా గమనించిన కొందరు ప్రాణాలను చేతిలో పెట్టుకొని చెట్లు ఎక్కారు. మరి కొందరు ఎత్తుగా ఉన్న గట్లపైకి ఎక్కారు. గంట గంటకు నీటి ఉధృతి పెరుగుతుంది. బిక్కుబిక్కుమంటూ గడిపారు. అందులో కొందరి దగ్గర సెల్‌ఫోన్ ఉండడంతో వారు గ్రామస్తులకు సమాచారం అందజేశారు. గ్రామ సర్పంచ్ రాముడు, గ్రామస్తులు సమాచారాన్ని మండల అధికారులకు తెలియజేశారు. దీంతో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఈఓఆర్డీ నాగేష్, ఆర్ఐ సుబ్బారెడ్డి, పోలీసులు ఇతర అధికారులు హుటా హుటిన గంజిహళ్లిలోని సంఘటన స్థలానికి చేరుకున్నారు. హంద్రీలో చిక్కుకున్న వారితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. చేపలు పట్టే నీటి తెప్పను తీసుకువచ్చి మత్స్యకారులు, గ్రామస్తుల సహాయంతో క్షేమంగా గట్టుకు చేర్చారు. ఎద్దులను తాళ్లసాయంతో గట్టుకు చేర్చారు. పొట్టేళ్లను తెప్పలో తీసుకువచ్చారు. దీంతోగ్రామస్తులు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

నీట మునిగిన పంటలు

నందవరం : మండలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ఓ మోస్తరు వర్షం కురవడంతో పంట పొలాలు నీట మునిగాయి. రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. మండల పరిధిలోని గంగవరం, పూలచింత, నందవరం, ముగతి తదితర గ్రామాల్లో బోరు బావులు, చెరువుల వద్ద సాగు చేసిన పంటలకు ఈ వాన నష్టం చేసింది.


పత్తి పొలంలో నిలిచిన నీటిని తోడుతున్న రైతు కుటుంబం

వంకలో కొట్టుకుపోతున్న ముగ్గురిని కాపాడిన యువకులు

ఆదోని రూరల్: ఆదోని మండలంలోని నాగనాథనహళ్లి వంకలో మంగళవారం ప్రమాదవశాత్తు కొట్టుకుపోతున్న తండ్రి, ఇద్దరు కొడులకును స్థానికంగా ఉన్న యువకులు హరిజన నరసప్ప, శేఖన్న, హరి కాపాడారు. భారీ వర్షాలకు నాగనాథనహళ్లి వంక ఉప్పొంగింది. దీంతో నాగనాథనహళ్లికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కోడుమూరు పట్టణానికి చెందిన తండ్రి, తన ఇద్దరు కుమారులతో కలసి హొళగుంద వైపు ఉన్న గోనేహాల్‌లో జరిగే శుభకార్యానికి వెళ్లేందుకు ఆదోని నుంచి బస్సులో వచ్చారు. వంక వద్ద బస్సు దింపి వెళ్లిపోయింది. దీంతో ఎలాగైనా శుభకార్యంలో పాల్గొనాలని తండ్రి, ఇద్దరు కుమారులు వంకలో దిగి వెళ్లేందుకు ప్రయత్నించగా, ఒక్కసారిగా వరద ఉధృతికి కొట్టుకుపోతుండగా స్థానిక యువకులు వారిని కాపాడి ఒడ్డుకు చేర్చారు.

అనుగ్రహ ప్రశస్థి అవార్డుల ప్రదానం



పీఠాధిపతి చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ వజ్ర భూషణ ఓజా , ప్రముఖ విద్వాన్ రఘుపతి ఉపాధ్యాయ



అవార్డు స్వీకరిస్తున్న ప్రముఖ విద్యాసంస్థలు, హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశనాథ స్వామిజీ

మంత్రాలయం : శ్రీరాఘవేంద్రుడి ఆరాధన సప్తరాత్రోత్సవాల్లో భాగంగా పలువురు ప్రముఖులకు శ్రీరాఘవేంద్రస్వామి అనుగ్రహ ప్రశస్థి అవార్డులు ప్రదానం చేశారు. యోగీంద్ర సభా మంటపంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల చేతుల మీదుగా బీజీఎస్ మరియు ఎస్‌జేబీఐటీ గ్రూపు విద్యాసంస్థలు, హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశనాథ స్వామిజీ, బెంగళూరుకు చెందిన విద్వాన్ రఘుపతి ఉపాధ్యాయ, వారణాసికి చెందిన సంస్కృత విద్యాపీఠం ప్రొఫెసర్ వజ్ర భూషణ్ ఓజా అవార్డులు అందుకున్నారు. వారిని పీఠాధిపతి నగదు, శేషవస్త్రం, రాఘవేంద్రుల జ్ఞాపిక, మొమెంటోలతో సత్కరించారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి హేయం

బంగ్లాదేశ్‌లో భారత్‌కు చెందిన హిందువులపై దాడులు చేయడం హేయమైన చర్య అని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఉద్ఘాటించారు. యోగీంద్ర సభా మంటపంలో స్వామిజీ దాడులపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలో ఎవరి ఆచారాలు, సంప్రదాయాలు వారివన్నారు. బంగ్లాదేశ్ మూకలు హిందువులపై పైశాచికంగా ప్రవర్తించడం శోచనీయమన్నారు. హిందువులపై దాడులను తాను ఖండిస్తున్నానని పేర్కొన్నారు. అలాగే మంత్రాలయంలో జరుగుతున్న ఉత్సవాలకు ప్రధాని నరేంద్రమోదీ, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రంగరాజన్ సందేశాన్ని పంపడం సంతోషదాయకమన్నారు.

సర్పంచ్‌గా నాకే అధికారం ఉంటుంది



మాట్లాడుతున్న సర్పంచ్ ఇందిరమ్మ

పెద్దకడబూరు : టీడీపీ మండల నాయకులు అధికారం మాదీ.. మీది ఏముంది అని అంటూ విర్రవీగుతున్నారని.. మా గ్రామానికి సర్పంచ్‌గా నాకుకాక ఇంకెవరికి అధికారం ఉంటుందని మండల పరిధిలోని హనుమాపురం సర్పంచ్ ఇందిరమ్మ మండిపడ్డారు. సోమవారం టీడీపీ నాయకులు సర్పంచ్‌పై చేసిన బెదిరింపు వాఖ్యలపై ఆమె ఘాటుగా స్పందించారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అధికారం లేదంటున్నారు.. ఎమ్మెల్యే మా పార్టీవారే, ఎంపీపీ, జెడ్పీటీసీ మా వారే.. సర్పంచ్ నేనే మీకు ఇంకేమి అధికారం కావాలి అని ప్రశ్నించారు. గ్రామంలో సమస్యలు ఏమి తెలుసుకోకుండా ఎవరో చెప్పిన (టీడీపీ) మాటలు నమ్మి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారు. ప్రజను విచారించి నిజానిజాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. మోటారు చెడిపోయింటే రిపేరి కోసం ఇచ్చాం, అయితే ఇంట్లో పెట్టుకున్నారు అని అనడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో మీ పార్టీవారు సర్పంచ్‌గా ఉన్నప్పుడు పంచాయతీ నిధులతో బోరు వేయించుకొని, మోటారు ఏర్పాటు చేసుకొని ఆ నీటిని పొలాలకు వాడుకున్న ఘనత మీదేనన్నారు. ఆ బోరును ఇప్పటికీ వారు ఒక్కరే ఆక్రమించుకొని ఉపయోగించుకుంటున్నారనేది గమనించాలని చెప్పారు. గ్రామంలో ఒక్క ఎంపీటీసీని పెట్టుకొని తామే అధికారం చెలాయిస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు పూజారి ఈరన్న, రాఘవేంద్ర, చిన్నఈరన్న, జయకృష్ణ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

కోసిగి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆరు నెలల పాటు అర్థశాస్త్రం బోధించడానికి తాత్కాలిక అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్స్‌పాల్ లక్ష్మీదేవి మంగళవారం తెలిపారు. అర్థశాస్త్రం పోస్టు గ్రాడ్యుయేట్స్‌లో 50శాతం ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఈ నెల 22వ తేదీలోపు స్థానిక కళాశాలలో దరఖాస్తులను అందజేయాలన్నారు.

మహిళల అభ్యున్నతే లక్ష్యం


మురుగు కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కమిషనర్, అధికారులు

ఆదోని టౌన్: నియోజకవర్గంలో మహిళల అభ్యున్నతికి ప్రతిఒక్కరూ తమవంతు సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే పార్థసారథి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పొదుపు మహిళలకు అండగా ఉంటూ వారి ఆర్థికాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని చెప్పారు. పొదుపు మహిళలు అభివృద్ధితోనే ఇంటిల్లిపాది సంతోషంగా ఉంటారన్నారు. సంఘాల ద్వారా రుణాలు, ఉన్నతి, స్త్రీనిధి రుణాల ద్వారా చిరు వ్యాపారులకు పాడి, పశువుల రైతులకు ఆర్థికంగా భరోసానివ్వాలన్నారు. కార్యక్రమంలో వెలుగు పీడీ సలీంబాషా, ఏపీఓ జనార్ధన్, సీసీలు రవి, తిక్కన్న, నల్లన్న, రామన్న, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల పరిశీలన

పట్టణంలో గత రాత్రి కురిసిన భారీ వర్షానికి పొంగి ప్రవహిస్తున్న మురుగు కాలువలను ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, కౌన్సిలర్లు, ఇంజినీరింగ్, శానిటరీ సెక్షన్ అధికారులు పరిశీలించారు. పట్టణంలోని కార్వన్‌పేట, తిక్కస్వామి దర్గా ఏరియాలో మురుగు కాలువలను పరిశీలించారు. అక్రమ కట్టడాల కూల్చివేత పనులను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. రోడ్లను ఆక్రమించుకొని వ్యాపారలావాదేవీలు నిర్వహిస్తున్న ఎంతటివారైనా ఉపేక్షించవద్దని, నిబంధనల మేరకు మున్సిపల్ స్థలం ఉన్నంతవరకు కూల్చివేసి రోడ్ల విస్తరణ చేపట్టాలని కమిషనర్, టీపీఓలకు సూచించారు.

చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు


జ్యోతులను ఊరేగిస్తున్న దృశ్యం

కోసిగి : మండల కేంద్రం కోసిగిలో తొగటవీరక్షత్రీయుల ఆరాధ్య దేవత చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవాలు మంగళవారం వేకువజామున అత్యంత వైభవంగా జరిగాయి. వేకువజామునే చౌడేశ్వరి అమ్మవారి ఇంటి నుంచి జ్యోతులను వెలగించుకొని మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని నైవేద్యాలు సమర్పించారు. ఉత్సవాల్లో కడాపాళెం, సిద్ధప్ప పాళెం చౌడేశ్వరిదేవి ఆలయ కమిటీ, భక్తులు, పెద్దలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు బస్సు నడపాలి

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద పీడీఎస్ఓ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేశారు. సంఘ కార్యదర్శి వీర ప్రతాప్ మాట్లాడుతూ.. విద్యార్థులు బస్సు పాసులు కట్టినా సమయానికి బస్సులు నడపకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు.

మలేరియాపై జాగ్రత్త వహించండి

గోనెగండ్ల : మలేరియా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లు రజిని, కార్తీక్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా డాక్టర్ రజిని ఆధ్వర్యంలో ఆస్పత్రి సిబ్బంది స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ మీదుగా ఎస్‌బీఐ వరకు నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే దోమలను నివారించు కోవచ్చునన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు హనుమంతు, సుధాకర్, పరమేష్, కృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మిగనూరురూరల్: సుఖ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఓఆర్‌డబ్ల్యూ హసీనాబేగం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కలుగోట్ల గ్రామంలో విజయ మహిళ మండలి ఆధ్వర్యంలో హెచ్ఐవీ, సుఖ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఓఆర్‌డబ్ల్యూలు ప్రవీణకుమారి, అంగన్‌వాడీ వర్కర్ సరోజమ్మ, జక్కన్న, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను ఉరి తీయాలి

గోనెగండ్ల : కోల్‌కతాలో డ్యూటీలో ఉన్న ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన వారిని బహిరంగంగా ఉరి తీయాలని ఐసా జిల్లా అధ్యక్షుడు రాజు, పీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సురేష్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం ఐసా సంఘం ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులతో కలిసి కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు. అలాగే పీఎస్‌యూ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ వసతి గృహంలో ఆ సంఘం నాయకులు కొవొత్తులు, కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలియజేశారు.


కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న మోడల్ స్కూల్ హాస్టల్ విద్యార్థినులు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి


సమావేశంలో మాట్లాడుతున్న ఆదోని ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ విశ్వనాథ్

ఆదోని రూరల్: రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదోని ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ (హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్) సి.విశ్వనాథ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అయన మాట్లాడుతూ గత సమీక్షలు జరిగిన రోడ్డు సేఫ్టీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల గురించి ఆరా తీశారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలో రోడ్లపై ఉన్న గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఆదోని పట్టణంలో పార్కింగ్ సమస్య ఎక్కువ ఉన్నందున దాటిపై ప్రత్యకమైన దృష్టి సారించాలన్నారు. నో పార్కింగ్ ఏరియాలో పార్కింగ్ చేయకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డుకు ఇరువైపులా తోపుడు బండ్లు విక్రయాలు జరిపేవారు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఎక్కడైనా కట్టడాలు జరిగితే వాటిని గుర్తించి విచారణ చేసి తొలగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఆర్డీఓ నాగేంద్ర, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిసిరాదీప్తి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి


మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ

ఎమ్మిగనూరురూరల్: పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ సూచించారు. మంగళవారం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా. కె.రాఘవేంద్రచౌదరి ఆధ్వర్యంలో కిసాన్ మేళ నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులకు పంటల సాగులో సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఎప్పుడు శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటారన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని దగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచుకుంటే పెట్టుబడి తక్కువలో ఎక్కువ లాభాలు పొందే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.నిరంజన్ రెడ్డి, డా.మౌనిక, శ్రీచందన్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

ఆదోని అర్బన్: మండలంలోని బసాపురం గ్రామ సమీపంలో బైకు అదుపు తప్పి రవికుమార్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. బైకుపై వస్తుండగా గుంతను తప్పించబోయి కింద పడినట్లు బాధితుడు రవి తెలిపాడు.

బొలెరో వాహనం ఢీకొని..

కోసిగి మండలానికి చెందిన అయ్యన్న కోసిగి గ్రామంలో రోడ్డు పక్కన నిల్చొని ఉండగా బొలెరో వాహనం ఢీకొట్టడంతో గాయపడ్డారు. వెంటనే అతడిని ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యం

పట్టణంలోని ఆదోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలిక అదృశ్యమైనట్లు వన్‌టౌన్ పోలీసులు మంగళవారం తెలిపారు. అదృశ్యమైన బాలిక ఆచూకీ తెలపాలని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఘర్షణ.. వ్యక్తికి గాయాలు

పట్టణంలోని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాగప్పకట్ట వద్ద విజయ్‌కుమార్, బెస్త వీరేష్‌ల మధ్య డబ్బు విషయంలో మాటామాటా పెరిగి ఘర్షణకు దిగారని వన్‌టౌన్ పోలీస్ కానిస్టేబుల్ సత్తార్‌అలీ తెలిపారు. బెస్త వీరేష్.. విజయ్‌కుమార్ తలపై కొట్టడంతో గాయమయ్యిందన్నారు. బాధితుడు విజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కానిస్టేబుల్ వెల్లడించారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

పట్టణ శివారులోని ఇస్వీ రోడ్డులో ఉన్న బాలెకొల్లు వద్ద పేకాట ఆడుతున్న ఆరు గురిపై వన్ టౌన్ పోలీసులు దాడులు చేశారు. వారిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.1,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు కానిస్టేబుల్ సత్తార్‌అలీ తెలిపారు.

10 మందిపై బైండోవర్ కేసులు

పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పది మంది రౌడీషీటర్లపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు కానిస్టేబుల్ సత్తార్‌అలీ తెలిపారు. వన్‌టౌన్ పరిధిలో రౌడీషీటర్లు ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తుండడంతో కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

20 మందిపై కేసు నమోదు

ఆదోని రూరల్: ఆదోని మండలం దొడ్డనగేరి గ్రామానికి చెందిన కురువ కొండయ్య, గొల్ల పరశప్ప పొలం వద్ద వర్షపునీరు వెళ్లే విషయంలో గొడవపడ్డారు. దీంతో ఒకరిపైఒకరు దాడి చేసుకోవడంతో ఇరువర్గాలకు స్వల్ప గాయాలైనట్లు ఎస్ఐ మహేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. కొండయ్య వర్గం 10 మంది, పరశప్ప వర్గానికి చెందిన పది మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

వర్గీకరణ వ్యతిరేక ర్యాలీ


ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు

ఆదోని రూరల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆదోని డివిజన్ ఎస్సీ వర్గీకరణ ఏజేసీ సమక్షంలో మంగళవారం నిర్వహించిన మహార్యాలీ విజయవంతమయ్యిందని జేఏసీ నాయకులు ఎంపీ లక్ష్మీనారాయణ, కే. వీరేష్, గంగాధర్, సాయిరాం, బాలాజీ, బొబ్బిలి తదితరులు తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ స్థానిక శ్రీనివాసభవన్ వద్దనున్న డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి సుమారు 500 మందికి పైగా మాలలు ర్యాలీని ప్రారంభించారు. భీమాస సర్కిల్ మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆదోని ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు.

నేడు భారత్ బంద్‌కు సహకరించాలి

ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ బుధవారం భారత్ బంద్ చేస్తున్నట్లు జేఏసీ కమిటీ నాయకులు తెలిపారు.